

ఓట్ల కోసమే శంకుస్థాపనలు

ఓట్ల కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపనల పేరుతో హడావుడి చేస్తోందని చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. - 8లో



దర్శనానికి 2గంటలు..

ఆదివారం అయినప్పటికీ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. - 10లో



ప్రజలను మభ్యపెడుతోంది

బీఆర్ఎస్ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతోందని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. -10లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఉదయాన్నే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, ఆరాధన నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, అర్చన జరిపించారు. ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి, ద్వార బంధనం చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

వలిగొండ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం వలిగొండ మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బరిసెట్టి వెంకటేశం, కొత్త వెంకటేశం, పాశం సత్తిరెడ్డి, గరిసె రవి, పలుసం సతీష్, కొమ్మిరెడ్డి నరేష్ రెడ్డి, బోడ హరికృష్ణ, పులిపలుపుల రాములు, కొత్త జంగయ్య, నరసింహ, తోట గట్టయ్య, జక్కల కొమురయ్య, కొంతం వెంకటరెడ్డి, ఎలం నరసింహ, జక్కల ప్రభాకర్, రోశయ్య, నరసింహ, కంబాల ఎల్లయ్య, పురుగుల మల్లయ్య, మేడబోయిన నరసింహ, యూత్ అధ్యక్షుడు పోషబోయిన నరేష్, ఉపాధ్యక్షుడు వల్లం నరేష్, జక్కల శివ, కంబాల ఎల్లయ్య, చిలుముల నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి సర్వే



బిక్కేరు వాగు వద్ద సర్వే చేస్తున్న ఐబీ అధికారులు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం), ఉప్పలపహడ్ వద్ద బిక్కేరు వాగులో చెక్ డ్యామ్ నిర్మాణం కోసం ఐబీ అధికారులు ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐబీ డీఈ సునీల్ ప్రసాద్ మాట్లాడుతూ బిక్కేరు వాగులో చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. ఆత్మకూరు(ఎం) చెక్ డ్యామ్‌కు రూ. 4.61కోట్లు, ఉప్పలపహడ్ చెక్‌డ్యామ్‌కు రూ. 3కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు ఎస్‌పీఎఫ్ భద్రత

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో నిర్మాణంలో ఉన్న 4 వేల మెగావాట్ల యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌కు ఎస్‌పీఎఫ్ భద్రతను అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యాదాద్రి దేవస్థానం, సచివాలయానికి ఉండే భద్రత వ్యవస్థ ఇక నుంచి పవర్‌ప్లాంట్ వద్ద ఉండనుంది. సాయుధులైన పోలీసులు ప్లాంట్ భద్రతను పర్యవేక్షించనున్నారు. ఎస్‌పీఎఫ్‌లో ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, 9 మంది ఏఎస్‌ఐలు, 19 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 53 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు. ఆదివారం కొందరు బాధ్యతలు స్వీకరించారు. రెండు రోజుల్లో ప్లాంటు వద్ద భద్రత పూర్తిస్థాయిలో నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్లాంట్ చుట్టూ వాచ్‌టవర్లు నిర్మించారు. ఎస్‌పీఎఫ్ సౌకర్యార్థం ప్లాంటులో అన్ని వసతులతో కూడిన భవనాన్ని నిర్మించారు. ప్లాంటు నిర్మాణ సమయం నుంచి విజిలెన్స్ భద్రతను పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం ఒక డీఎస్పీ, ఒక సీఐ, ఐదుగురు పోలీసుల బృందం ఎస్‌పీఎఫ్‌తో సమానంగా పనిచేయనున్నారు.

మద్దతుపై నిరాశ!

- పత్తి క్వింటాకు రూ.7,020 ప్రకటించిన సీసీఐ
- గిట్టుబాటు కాదంటున్న రైతులు
- చేలకు తెగుళ్ల బెడద.. దిగుబడిపై ప్రభావం
- క్వింటా రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్
- జిల్లాలో 1,02,777 ఎకరాల్లో పత్తి సాగు



రామన్నపేటలో పత్తి తీస్తున్న కూలీలు

రామన్నపేట: గత మూడు సంవత్సరాలుగా నష్టాలను చవిచూసిన రైతులు ఈఏడాది గంపెడాశతో పత్తిపంటను సాగు చేశారు. ప్రారంభంలో వర్షాలు ఆలస్యంగా కురిసినా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో కురిసిన వానలు పత్తిరైతులకు ఊరటనిచ్చినా పెట్టుబడులు మాత్రం తడిసిమోపడయ్యాయి. దున్నకాలు, విత్తనాలు, ఎరువులు, కూలీలకు ఇతరత్రా ఖర్చులు కలుపుకుని ఇప్పటి వరకు ఎకరానికి రూ.37వేల వరకు పెట్టుబడి వచ్చింది. సాధారణంగా ఎకరాకు 12నుంచి 17 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ, ఈసారి కూడా పంట చేతికొస్తున్న తరుణంలో తెగుళ్లు చుట్టుముట్టాయి. ప్రధానంగా జాజురోగంతో చేలు ఎర్రబారి పూత, పిందె రాలిపోతోంది. దీంతో ఎకరానికి 4నుంచి 5క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,020కాకుండా రూ.10వేలు లభిస్తేనే లాభాలు ఆర్జించే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

5,13,888 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా..

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జిల్లాలో రైతులు 1,02,777ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే 8వేల ఎకరాలు తక్కువ. వాతావరణం అన్నివిధాలా అనుకూలించినట్లయితే 5,13,888 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా భువనగిరి, మోత్కూరు, ఆలేరు, చౌటుప్పల్, వలిగొండ వ్యవసాయ మార్కెట్‌ల పరిధిలోని 14 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా క్వింటాకు రూ.7,020ల మద్దతు ధర దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు.

పెరిగిన పెట్టుబడులతో పోల్చుకుంటే..

గతేడాది సీసీఐ మద్దతు ధర క్వింటాకు రూ.6,030 మాత్రమే ప్రకటించింది. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు మద్దతు ధరకంటే ఎక్కువ రేటుకు కొనుగోలు చేయడంతో సీసీఐ నామమాత్రంగా కొనుగోలు చేయడం జరిగింది. గతేడాది వర్షాలలో తీసిన మొదటిదశ పత్తిని క్వింటాకు రూ.7వేలకు, రెండవ దశ పత్తిని రూ.8వేల నుంచి రూ.9,500 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. సీజన్ చివరి నాటికి రూ.11వేల వరకు పలికింది. కొందరు రైతులు ధర ఇంకా పెరుగుతుందన్న ఆశతో ఇళ్లలో పత్తిని నిల్వ చేశారు. కానీ మార్కెట్‌లో ధర అమాంతం పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయితే ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మద్దతు ధర కొంతమేర ఆశాజనకమే అయినప్పటికీ ఈయేడు పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పోల్చుకుంటే తక్కువేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఏటేటా ఖర్చులు పెరుగుతున్నాయి



పత్తిసాగుకు ప్రతియేడు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. సరైన దిగుబడి, ధర లేక నష్టం వాటిల్లుతుంది. గతేడాది పంటచేతికి వచ్చే సమయానికి మార్కెట్‌లో ధర క్వింటాకు రూ.2వేల వరకు పడిపోయింది. పెరుగుతుందని ఆశతో మూడు నాలుగు నెలలు నిల్వ చేశాం. విధిలేని పరిస్థితుల్లో చాలా తక్కువ ధరకు అమ్ముకున్నాం. పెరిగిన ఖర్చులకు తగ్గట్టు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలి.

– పర్నె వెంకటరెడ్డి, రైతు, వెల్లంకి

మద్దతు ధర రూ.10వేలు నిర్ణయించాలి



జిల్లాలో వరి తరువాత రైతులు పత్తిని అధికంగా సాగు చేస్తుంటారు. పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. ఖర్చుకు తగ్గట్టు మద్దతు ధర లభించడం లేదు. రైతులు నష్టాలను చవి చూస్తున్నారు. ప్రభుత్వం పత్తి మద్దతు ధరను రూ.10వేలుగా నిర్ణయించాలి. దిగుమతులపై ఆంక్షలు విధించి ఎగుమతులను ప్రోత్సహించాలి.

– మేక అశోక్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మండలాల వారీగా సాగు వివరాలు

జిల్లాలో 1,02,777 ఎకరాల్లో పత్తి సాగైంది. మండలాల వారీగా అడ్డగూడూరులో 12,900 ఎకరాలు, ఆలేరులో 3,570 ఎకరాలు, ఆత్మకూరు(ఎం)లో 3,983 ఎకరాలు, గుండాల 8,150 ఎకరాలు, భూదాన్‌పోచంపల్లిలో 45 ఎకరాలు, భువనగిరి 5,570 ఎకరాలు, బీబీనగర్ 60 ఎకరాలు, వలిగొండ 6,398 ఎకరాలు, చౌటుప్పల్ 9,184 ఎకరాలు, మోటకొండూరు 9,850 ఎకరాలు, మోత్కూరు 7,300 ఎకరాలు, సంస్థాన్ నారాయణపురంలో 23,562ఎకరాలు, రామన్నపేటలో 6,820 ఎకరాలు, బొమ్మలరామారం 95 ఎకరాలు, రాజాపేట 2,231 ఎకరాలు, తుర్కపల్లి 508 ఎకరాలు, యాదగిరిగుట్ట మండలంలో 2,550 ఎకరాల్లో పత్తి సాగు చేశారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి



పెద్దకందుకూరులో బీటీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. యాదగిరిగుట్ట మండలంలోని పెద్దకందుకూరు– యాదగిరిగుట్ట ప్రధాన రహదారికి రూ.65 లక్షలతో రెన్యువల్ పనులను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రజలు కేసీఆర్ పాలననే విశ్వసిస్తున్నారని, ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్, మచ్చ లక్ష్మీనారాయణ, కసావు శ్రీనివాస్, జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పనులతో తీర్చిదిద్దుతాం

ఆలేరురూరల్: ఆలేరును ప్రగతి పనులతో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. ఆదివారం ఆలేరు మండలంలోని కొలనుపాక, శ్రీనివాస్‌పురం, మందనపల్లి, టంగుటూరు, శారాజిపేట, తూర్పుగూడెం గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. 9ఏళ్లలో ప్రతిపక్షాల దిమ్మతిరిగేలా ఆలేరు మండలాన్ని అభివృద్ధి చేసి చూపామని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు చేసిందేమిటో చెప్పాలని ప్రశ్నించారు. కొలనుపాక వాగుపై రూ.4 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ నాయకుల వారంటీ, గ్యారంటీ లేని పథకాలను నమ్మితే ప్రజలు గోసపడుతారని, కన్నీళ్లే మిగులుతాయని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, సర్పంచ్‌లు ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వడ్ల నవ్యశోభన్ బాబు, బండ పద్మపర్వతాలు, వంగాల శ్రీశైలం, నాయకులు రాంనర్సయ్య, ఉపసర్పంచ్‌లు కంతి మహేందర్, జంపాల సత్యనారాయణ, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో 11, 12వ తేదీల్లో జరగనున్న సీపీఎం ప్రాంతీయ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేషం కోరారు. శిక్షణ తరగతులు నిర్వహించే ఫంక్షన్ హాల్ స్థలాన్ని ఆదివారం మోత్కూరు మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల నుంచి ముఖ్యమైన నాయకులు హాజరవుతారని తెలిపారు. మొదటి రోజు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు శిక్షణ తరగతులు ప్రారంభిస్తారని, రెండో రోజు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి, రాములమ్మ, మండల నాయకులు అంజయ్య, నరసింహ పాల్గొన్నారు.

79 మందికి ఉద్యోగాలు రావడం గర్వంగా ఉంది



కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన వారితో గూడూరు నారాయణరెడ్డి

- గూడూరు నారాయణరెడ్డి

భువనగిరి: గూడూరు నారాయణరెడ్డి ఫౌండేషన్ ద్వారా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచితంగా 250 మంది శిక్షణ పొందిన వారిలో 79 మంది ఉద్యోగాలు సాధించడం గర్వంగా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని పీఎస్ రెడ్డి అకాడమీలో నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌కు వెళ్లలేని పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం గూడూరు నారాయణరెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పేద వారి చదువుల కోసం తనవంతుగా సాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో పీఎస్ రెడ్డి అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు స్నేహ, దివ్య, ఉమా, మౌనిక, వేదవతి, మల్లీశ్వరీ, శరణ్య, రవికుమార్, వేణుగోపాల్, మహేష్, రాకేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టంభనకు తెరపడేదెన్నడో!

- నిలిచిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ
- తాజాగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు



భువనగిరి: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పటికే ఎస్జీటీల పదోన్నతులు నిలిచిపోగా తాజాగా వారి బదిలీలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రక్రియ మళ్లీ మెదటికొచ్చింది. బదిలీల కోసం 2,260 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 7, 8వ తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని తాజాగా ప్రకటించిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అంతలోనే ప్రక్రియ నిలిచిపోవడంపై ఉపాధ్యాయుల్లో తీవ్ర నిరాశతో ఉన్నారు. టెట్ అర్హతపై ఈ నెల 10వ తేదీన కోర్టులో నిర్ణయం రానుంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా నుంచి కోర్టులో జీఓ నంబర్ 317 ప్రకారం రావాల్సిన సంఖ్య కంటే అధికంగా జిల్లాకు ఉపాధ్యాయులు రావడంతో వేసిన పిటిషన్‌పై ఈ నెల 19న కోర్టులో విచారణ ఉంది.

జీహెచ్‌ఎంల బదిలీలు పూర్తి..

జిల్లాలో ఇటీవల జీహెచ్‌ఎంల బదిలీలు పూర్తయ్యాయి. ఇందులో 22 మంది ఇతర జిల్లాలకు వెళ్లగా 16 మంది జిల్లాలోనే బదిలీ అయ్యారు. వీరితో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు ఐదుగురికి పదోన్నతులు లభించగా ఇందులో నలుగురు ఇతర జిల్లాలకు వెళ్లగా ఒక్కరు మాత్రమే జిల్లాలోనే ఉండిపోయారు. పదోన్నతులు లేక బదిలీ అయిన ఎస్ఏల స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బంది లేక ఇప్పటికే వారు విధులు నిర్వహించే బడుల్లోనే పని కానిస్తున్నారు. ఇక భాష పండితులు, పీఈటీ పోస్టులకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

సమ్మెటివ్ పరీక్షలపై ప్రభావం..

జిల్లాలో ఇప్పటికే మూడు రోజుల క్రితం సమ్మెటివ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బదిలీలు, పదోన్నతుల హడావుడిలో ఉపాధ్యాయులు నిమగ్నం కావడంతో విద్యార్థులపై అంతగా దృష్టి పెట్టడం లేదు. దీంతో పాటు టెట్ అర్హత లేని వారికి పదోన్నతులు ఎలా కల్పిస్తారని పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఎస్జీటీల పదోన్నతుల ప్రక్రియ నిలిచింది. ఈ తర్వాత బదిలీలు కొనసాగించాలని ఆదేశాలు వచ్చాయి. ఎస్జీటీల బదిలీలు జరుగుతాయని భావించిన వారికి నిరాశే మిగిలింది. దీనికి తోడు నేడే రేపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే బదిలీ ప్రక్రియ కొనసాగుతుందా లేదా అనే సందేహం ఉపాధ్యాయుల్లో నెలకొంది.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే సమస్యలు



ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ సవ్యంగా సాగడం లేదు. రంగారెడ్డి జిల్లాలో జీఓ నంబర్ 317 ప్రకారం దొడ్డిదారిన జరిగిన ఉపాధ్యాయుల ప్రవేశాలతో తమకు అన్యాయం జరుగుతుందని స్థానిక ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లారు. ఈ విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. అలాగే 2010కి ముందు ఉపాధ్యాయులకు టెట్ అర్హత లేనందున వారికి 3 సంవత్సరాలు గాని లేదా 5 సంవత్సరాల సర్వీస్ కాలంలో టెట్ రాసుకునేందుకు అవకాశం కల్పించాలి.

– మైలారం సత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

సూపర్ న్యూమరరీ పోస్టులు ఏర్పాటు చేయాలి




ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అప్‌గ్రేడ్ చేసిన భాష పండితులు, పీఈటీల పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 4,500 మంది భాష పండితులు, పీఈటీలకు పని చేయడానికి స్థానం లేకుండా మిగిలిపోతున్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సూపర్ న్యూమరరీ పోస్టులు ఏర్పాటు చేసి ఉన్నత పాఠశాలలకు కేటాయించి భాష పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి.

– అయితగోని వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ జిల్లా అధ్యక్షుడు

‘ఇంటిగ్రేటెడ్’కు నిధుల కొరత

- సమీకృత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి మూడేళ్లు
- పెండింగ్‌లోనే విద్యుత్ లైట్లు, రోడ్డు నిర్మాణ పనులు



భువనగిరిలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్

భువనగిరి: అత్యంత అధునాతన హంగులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిధుల కొరతతో నిలిచిపోయాయి. త్వరలోనే అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన పట్టణ ప్రజలకు, వీధి వ్యాపారులకు నిరాశ మిగిలింది. ఒకే చోట మాంసం, కూరగాయలు, పండ్లు, పూలు, కిరాణం సామగ్రి అమ్మకాలు జరిగే విధంగా 2020 అక్టోబర్ 2న మంత్రి కేటీఆర్ ఇంటిగ్రేటెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మూడేళ్లు గడిచినా నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో ఇప్పట్లో ఈ మార్కెట్‌ను ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి తోడు రేపోమాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే అభివృద్ధి పనుల ప్రారంభానికి తెరపడనుంది.

రూ.8.70కోట్ల అంచనాతో నిర్మాణం..

భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లా, రోడ్డు రవాణ, భవనాల శాఖ కార్యాలయం ఆవరణలో రూ.8.70 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి కేటాయించారు. ఇందులో 192 స్టాల్స్‌ను నిర్మించారు. ఇందులో వెజ్ కోసం 85, నాన్‌వెజ్ కోసం 45, పూలు, పండ్ల విక్రయాల కోసం 15, కిరాణం సామగ్రి విక్రయానికి 15తో పాటు ఇతర అవసరాల కోసం 32 స్టాల్స్‌ను నిర్మించారు. ఇప్పటికే మార్కెట్‌లో పెయింటింగ్ పనులు కూడా పూర్తి చేశారు. వీటికి గాను ఇప్పటికే రూ.6.50కోట్లు వెచ్చించారు. అయితే నిధుల కొరత ఏర్పడడంతో మార్కెట్‌లో విద్యుత్ లైట్లు, మార్కెట్ ఆవరణలో రోడ్డు వేయలేదు. గత కొంత కాలంగా పనులు నిలిచిపోవడంతో మార్కెట్ ఆవరణ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

త్వరలోనే నిధులు



భువనగిరిలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో అన్ని పనులు పూర్తయ్యాయి. కేవలం విద్యుత్ లైట్లు, మార్కెట్ ఆవరణలో రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనుల నిర్వహణకు నిధులు లేకపోవడంతో రూ.1.50 కోట్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే నిధులు వచ్చే అవకాశం ఉంది. రాగానే మిగిలిన పనులు కూడా పూర్తి చేసి అందు బాటులోకి తీసుకువస్తాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

గర్భిణి అవస్థలు



ఆర్టీసీ బస్సు కోసం వేచిచూస్తున్న గర్భిణి

ఆత్మకూరు(ఎం): ఆస్పత్రికి వెళ్లేందుకు గర్భిణి ఆర్టీసీ బస్సు కోసం సుమారు రెండు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఆత్మకూర్ మండలంలోని పుల్లాయిగూడేనికి చెందిన గర్భిణి బత్తిని అనూష భువనగిరి ఏరియా ఆస్పత్రిలో చూపించుకుంటుంది. డెలివరీ సమయానికి పది రోజుల ముందు అడ్మిట్ కావాలని ఆస్పత్రి సిబ్బంది సూచించడంతో ఆదివారం ఉదయం గ్రామం నుంచి బయలుదేరింది. గ్రామానికి చెందిన ఆశ కార్యకర్తను తోడుగా వచ్చి అడ్మిట్ చేయాలని కోరడంతో ఆమె తాను రాలేనని చెప్పడంతో తన తల్లి సాయంతో రహీంఖాన్‌పేట స్టేజీ వద్దకు వచ్చి బస్సు కోసం నిరీక్షిస్తోంది. రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకుండా వెళ్లిపోయాయి. 108కు ఫోన్ చేస్తే తాము సూర్యాపేటకు వెళ్తున్నామని, వలిగొండ, భువనగిరి 108లకు ఫోన్ చేయమని సూచించారు. రెండు గంటల అనంతరం వచ్చిన ఆర్టీసీ బస్సులో ఆస్పత్రికి వెళ్లింది.

సేవ చేసే భాగ్యం కల్పించడం నా అదృష్టం

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



ప్రగతి యువజన సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: భువనగిరి నియోజకవర్గ ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గల పోచంపల్లి పట్టణం, ముక్తాపూర్, రేవనపల్లిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలు, కమ్యూనిటీ భవనాలు, ప్రగతి యువజన సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో రాజకీయాల్లోకి కొత్తగా వచ్చిన తనను ప్రజలు ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. 2018 ఎన్నికల్లో సైతం రెండోసారి ఆదరించారని, ఈ రుణం ఎన్నటికీ మరిచిపోనన్నారు. అదేవిధంగా ఏదులాబాద్ మీదుగా వెళ్లే భద్రాద్రి హైవేను గౌరెల్లి నుంచి పోచంపల్లి మీదుగా వెళ్లేలా తాను మంత్రి, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడానని చెప్పారు. అభివృద్ధి కాంక్షిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. అదేవిధంగా స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే తన సొంత నిధులతో 760 మంది యువతీ, యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేశారు. అంతకుముందు పట్టణ కేంద్రంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. జూలూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, జెడ్పీటీసీ పుష్పలత, మున్సిపల్ వైస్‌చైర్మన్ లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ నర్సింహారెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశం, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, సర్పంచ్ రేణుకనర్సింగ్‌రావు, ఎంపీటీసీ శంకరమ్మ కిష్టయ్య, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


మహేష్ (ఫైల్)

కేతేపల్లి: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో నెల రోజుల క్రితం పురుగు మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామానికి చెందిన ఏర్పుల మల్లయ్య చిన్న కుమారుడు మహేష్(24) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో సెప్టెంబర్ 5న తల్లిదండ్రులు మహేష్‌ను మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ అదే రోజు రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి మహేష్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. నెల రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్న మహేష్ ఆరోగ్యం విషమించి ఆదివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


గణేష్ (ఫైల్)

నల్లగొండ క్రైం: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ మండలంలోని ముశంపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ముశంపల్లి గ్రామానికి చెందిన జంజిరాల గణేష్(34) భార్య గతంలోనే చనిపోయింది. వారికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ముశంపల్లి గ్రామంలోనే తన సోదరుడు శివతో కలిసి ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గణేష్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పని నిమిత్తం బయటకు వెళ్లిన అతని సోదరుడు శివ వచ్చేసరికి గణేష్ ఉరికి వేలాడుతుండడంతో కిందకు దింపి చూడగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గణేష్ సోదరుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఫంక్షన్ హాల్ వాచ్‌మన్ గదిలో చోరీ

బొమ్మలరామారం: మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో గల శ్రీరామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న వ్యక్తి గదిలో ఆదివారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన అప్పారావు వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. అప్పారావు తన భార్య, కుమారుడితో కలిసి ఫంక్షన్‌హాల్‌లోనే ఓ గదిలో నివాసముంటున్నాడు. ఆదివారం అప్పారావు భార్య, కుమారుడు కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర గ్రామంలో గల ఓ చర్చిలో ప్రార్థన చేసేందుకు వెళ్లారు. అప్పారావు సైతం రామలింగంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పైప్‌లైన్ పనులు చేసేందుకు కూలిగా వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు అప్పారావు గదికి వేసిన తాళం పగులగొట్టి రూ.10వేల నగదు, అర తులం బంగారం, సెల్‌ఫోన్, గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. మధ్యాహ్న భోజనానికి ఇంటికి తిరిగి వచ్చిన అప్పారావు గదికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్నేహితుడి గొంతు కోసిన యువకుడు

- పోలీసుల అదుపులో నిందితుడు

నాగార్జునసాగర్: స్నేహితుడిని ఇంటికి పిలిచి గొంతు కోసి పరారయ్యాడు ఓ యువకుడు. ఈ ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీలో నివాసముంటున్న నల్లగంతుల నితిన్ శనివారం సాయంత్రం బుద్ధవనంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న తన చిన్ననాటి స్నేహితుడు పుట్టపాక విష్ణువర్ధన్‌కు ఫోన్ చేసి ఇంటికి రమ్మన్నాడు. విష్ణువర్ధన్ వెళ్లేసరికి నితిన్ మద్యం, గంజాయి సేవించి మత్తులో ఉన్నాడు. తన గురించి చెడుగా ప్రచారం చేస్తున్నావంటూ విష్ణువర్ధన్‌తో నితిన్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతుండగానే నితిన్ తన వద్ద ఉన్న బ్లేడ్‌తో విష్ణువర్ధన్ గొంతు కోసి పరారయ్యాడు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నితిన్‌పై కేసు నమోదు చేసి అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విజయపురి టౌన్ ఎస్ఐ సంపత్‌గౌడ్ తెలిపారు. విష్ణువర్ధన్‌ను ఆస్పత్రికి తరలించగా వైద్యులు అతడి గొంతుపై 9 కుట్లు వేశారు. ప్రాణాపాయం ఏమీలేదని డాక్టర్లు తెలిపారు.

ఓట్ల కోసమే శంకుస్థాపనలు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్: వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం శంకుస్థాపనల పేరుతో హడావుడి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మునుగోడు నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర ఆదివారం చౌటుప్పల్ మండలంలోని ధర్మోజిగూడెం గ్రామంలో ప్రారంభమై ఎల్లంబావి, ఎల్లగిరి, ఖైతాపురం, బొర్రోళ్లగూడెం, తూప్రాన్‌పేట్, మల్కాపురంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలను అడిగి వారి సమస్యలను చలమల్ల కృష్ణారెడ్డి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి టెండర్లు పిలువకున్నా కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకు మాత్రమే శంకుస్థాపనల పేరుతో అధికార పార్టీ నాయకులు ఆర్భాటం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో గుర్తుకురాని అభివృద్ధి ఎన్నికల సమయంలోనే బీఆర్ఎస్ నాయకులకు ఎందుకు గుర్తొచ్చిందో ప్రజలు గ్రహించాలన్నారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను సొంత పార్టీ కార్యకర్తలకే ధారాదత్తం చేస్తున్న బీఆర్ఎస్ నేతలను గ్రామాలకు రానివ్వొద్దని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో మునుగోడు నియోజకవర్గం పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బ్లాక్, మండల, మున్సిపల్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నర్సింహ, నాయకులు ముప్పిడి సైదులుగౌడ్, గూడూరు వెంకట్‌రెడ్డి, ఖయ్యూం, బత్తుల శ్రీహరి, కొంతం పద్మ, రాచకొండ భార్గవ్, మాదగోని శేఖర్, ఊదరి శ్రీనివాస్, వల్లబోతు నారాయణ, బాలం శేఖర్, తగరం నాగరాజు, చంచల శ్రీను, మునుకుంట్ల రాజు, మేకల దేవేందర్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, బాలెం అండాలు, ఢిల్లీ చంద్రకళ, అబ్బాస్‌బేగం, కొమ్ము సుధ, ఈద్దుల విజయ్ తదితరులు ఉన్నారు.


ధర్మోజిగూడెంలో పాదయాత్ర నిర్వహిస్తున్న చలమల్ల కృష్ణారెడ్డి

ధర్నాను విజయవంతం చేయాలి


నార్కట్‌పల్లి: సమావేశంలో పాల్గొన్న డివిజన్ అధ్యక్షుడు నలపరాజు సైదులు తదితరులు

నార్కట్‌పల్లి: ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం, మంగళవారం నిర్వహించనున్న చలో హైదరాబాద్- ఎల్ఐసీ జోనల్ ఆఫీస్ ధర్నాను విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీఎన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నార్కట్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన ఎల్ఐసీ సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేసి, కార్పొరేట్లకు అప్పగించే దిశలో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. బీమా రంగంలో అన్ని లావాదేవీలపై జీఎస్టీని తొలగించాలని, రెన్యూవల్ కమిషన్ మినహాయించి ఐఆర్‌డీఏఐ డ్రాఫ్ట్ రిపోర్టును ఉప సంహరించుకోవాలన్నారు. ఎల్ఐసీ ఏజెంట్లకు గ్రాట్యుటీని పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, వయోపరిమితిని పెంచి ప్రీమియం తగ్గించాలన్నారు. ఏజెంట్లకు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ఏజెంట్లకు రక్షణ కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక సోమిరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు నలపరాజు సైదులు, డివిజన్ నాయకులు ప్రజ్ఞాపురం శివశంకర్, ధనుంజయ రావు, ఖమ్మంపాటి సైదులు, దేవేందర్, వెంకన్న, అరుణ, మహేశ్వరీ, కవిత తదితరులున్నారు.


ఎస్‌వీఎన్ రెడ్డి

విద్యుత్ శాఖ సీజీఎం కృష్ణయ్య మృతి

నల్లగొండ: విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ పప్పుల కృష్ణయ్య మృతిచెందారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయనకు ఆదివారం సాయంత్రం ఛాతిలో నొప్పి రావడంతో హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కృష్ణయ్య భౌతికకాయానికి ఆయన సొంతూరు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లిలో సోమవారం అంత్యక్రియలు జరగనున్నాయి. ఇటీవలే సివిల్స్ ఫలితాల్లో ఆయన కుమారుడు ఐఏఎస్‌గా సెలెక్ట్ అయ్యాడు. నల్లగొండలో ఆయన ఏఈగా, ఏడీఈగా, జిల్లా ఎస్ఈగా పనిచేశారు. పదోన్నతిపై ఇటీవల హైదరాబాద్‌కు వెళ్లారు.



ఫోన్ పే చేస్తానని మోసం

- దుకాణ యజమానిని మభ్యపెట్టి రూ.41,500 కాజేసిన యువకుడు

కొండమల్లేపల్లి: ఎలక్ట్రికల్ దుకాణానికి వచ్చిన ఓ యువకుడు తాను కొనుగోలు చేసిన వస్తువులకు ఫోన్ పే ద్వారా నగదు చెల్లింపు చేస్తానని చెప్పి దుకాణ యజమాని ఖాతా నుంచి రూ.41,500 కాజేశాడు. ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు రోజుల క్రితం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల ఎలక్ట్రికల్ దుకాణానికి ఓ యువకుడు వచ్చి రూ.4,250 విలువైన సామగ్రి కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించిన పేమెంట్‌ను ఫోన్ పే ద్వారా చేస్తా అని దుకాణ యజమానికి చెప్పాడు. ఇంతలోనే తన ఫోన్ పేలో డబ్బులు లేవని, మా సార్‌కు ఫోన్ చేసి డబ్బులు పంపించమని చెబుతానని దుకాణ యజమాని ఫోన్‌ను తీసుకున్నాడు. ఈ లోగా దుకాణ యజమాని తన పనిలో నిమగ్నమవ్వగా ఆ యువకుడు దుకాణ యజమాని బ్యాంకు ఖాతాలోని రూ.41,500 తనకు సంబంధించిన ఖాతాకు బదిలీ చేశాడు. తీరా మా సార్ ఫోన్ ఎత్తడం లేదని, సామగ్రిని ప్యాక్ చేసి పెట్టాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు ఉదయం తన ఖాతాలో నగదు లేకపోవడంతో దుకాణ యజమాని లబోదిబోమన్నాడు.

బైక్ పైనుంచి పడి గాయాలు

మర్రిగూడ: అదుపుతప్పి బైక్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిగూడ మండలంలోని శివన్నగూడ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివన్నగూడ గ్రామానికి చెందిన ముంత యాలాద్రి తన బంధువుతో కలిసి పని నిమిత్తం బైక్‌పై మర్రిగూడ వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో శివన్నగూడ గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో యాలాద్రికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని మర్రిగూడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి అతడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. బాలుడికి తీవ్ర గాయాలు

- తల్లిదండ్రులకు స్వల్ప గాయాలు

భువనగిరి క్రైం: బైక్‌ను బస్సు ఢీకొట్టిన ఘటనలో బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలు కాగా.. వారి కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం భువనగిరి మండలంలోని చందుపట్ల స్టేజీ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జనగామ జిల్లా నెల్లుట్ల గ్రామానికి చెందిన కుమారస్వామి ఆదివారం తన భార్య, కుమారుడితో కలిసి బైక్‌పై భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామంలో ఉంటున్న తమ బంధువుల ఇంటికి వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో చందుపట్ల స్టేజీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బస్సు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమారస్వామి, అతడి భార్యకు స్వల్పగాయాలు కాగా.. వారి కుమారుడు అఖిల్‌కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అఖిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ధాన్యం వ్యాపారిపై కేసు నమోదు

- పరారీలో వ్యాపారి

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు: రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వ్యాపారిపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చిలుకూరు మండలంలోని కొత్త కొండాపురం గ్రామానికి చెందిన ఓ ధాన్యం వ్యాపారి పలువురు రైతుల నుంచి మధ్యవర్తుల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. దీంతో గ్రామానికి చెందిన కళింగరావు అనే రైతు ధాన్యం వ్యాపారిపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. అంతేకాకుండా సెప్టెంబర్ 28వ తేదీన సాక్షికలో 'రైతులకు రూ.2.20 కోట్లు కుచ్చుటోపీ' శీర్షికన ధాన్యం వ్యాపారిపై వార్తా కథనం కూడా ప్రచురితమైంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి పరారైన ధాన్యం వ్యాపారి కోసం గాలిస్తున్నారు.


రైతులకు రూ.2.20కోట్ల కుచ్చుటోపీ

ధాన్యం వ్యాపారిపై సాక్షిలో వచ్చిన కథనం

దేవుళ్ల పేరుతో చందా వసూలు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రజలు

మిర్యాలగూడ అర్బన్: దేవాలయాల్లో అన్నదానం చేస్తామంటూ పలువురు వ్యక్తులు బలవంతంగా చందా వసూలు చేస్తున్నారని మిర్యాలగూడ పట్టణ ప్రజలు ఆదివారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామంలో యాత్రిక నిత్యాన్నదాన సత్రం నిర్మిస్తున్నామని పలువురు వ్యక్తులు మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో రెండు వాహనాల్లో సంచరిస్తూ ఇంటింటికి తిరిగి చందా వసూలు చేస్తున్నారు. కాగా ఆదివారం తమ అనుమతి లేకుండా తమ ఇంట్లోకి ప్రవేశించి రూ.10వేల నుంచి రూ.15వేల చందా రాయాలంటూ బలవంతం చేస్తున్నారని గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు చందా వసూలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి ఆత్మకూరు పోలీసులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అయితే వారు నిత్యాన్నదానం చేస్తున్న విషయం వాస్తవమేనని, కానీ బలవంతంగా చందా వసూలు చేయరాదని వారికి కౌన్సెలింగ్ ఇచ్చామని పోలీసులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తుంగతుర్తి: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1982-83 బ్యాచ్ విద్యార్థులు


కోదాడ: కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల 1981-84 బ్యాచ్ విద్యార్థులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 1982-83 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరొకొకరు తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు మల్లే కృష్ణమూర్తి, భీంరెడ్డి ఇంద్రసేనారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీంరెడ్డి వెంకట్‌రెడ్డి, ఓరుగంటి అంతయ్య, ఆకారపు రామయ్య, ఓరుగంటి సత్యనారాయణ, పాలవరపు సంతోష్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యాకయ్య, పూర్వ విద్యార్థులు గుజ్జ శ్రీనివాస్, వర్దెల్లి కృష్ణయ్య, సురేందర్‌రావు, ఓరుగంటి శోభన్ బాబు, అంబటి రమేష్, జి. రమేష్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో..

భువనగిరి: పట్టణంలోని బాగాయత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని సంకల్ప్ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మల్లారెడ్డి, నాగెల్లి లక్ష్మి, పూర్వ విద్యార్థులు విఠల్, నాగరాజు, కిరణ్, శ్రీధర్, నర్సింగ్, భాస్కర్, మాధవి, కుచ్చుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


భువనగిరి: తమకు చదువు చెప్పిన టీచర్లతో 1987-88 బ్యాచ్ విద్యార్థులు

40ఏళ్ల తర్వాత..

కోదాడ: పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో గల కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1981-1984 మధ్య బీఏ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. దాదాపు 40 సంవత్సరాల తర్వాత స్నేహితులను కలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి అధ్యాపకులు శ్రీరామకవచం వెంకటేశ్వర్లు, మంత్రిప్రగడ భరతరావు, రంగారావు, ప్రసన్నాంజనేయులు, అందె సత్యం, మేరీకుట్టి జోసెఫ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కె. రమేష్, తుమ్మ ప్రసాద్, కేవీ శ్రీధర్, కోనేరు శ్రీనివాసరావు, వక్కవంతుల నాగార్జున, ఎస్. రాంరెడ్డి, పందిరి నాగిరెడ్డి, కోగారు రాణి, విజయ, ఇందిరా, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

నల్లగొండ: రాష్ట్ర బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీ - స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ, స్టడీ మెటీరియల్ అందజేయనున్నట్లు స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతగల వారు బీసీ స్టడీ సర్కిల్, రోడ్ నెం.9, శ్రీనగర్ కాలనీ, ఎన్జీ కాలేజ్ వెనుక వైపు, నల్లగొండలో 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులను ఎంపిక చేసి, స్టడీ సర్కిల్ ఆన్‌లైన్ యాప్ ద్వారా యూజర్ ఐడీ, పాస్ వర్డ్ ఇచ్చి ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఇతర వివరాలకు బీసీ స్టడీ సర్కిల్‌లో లేదా 08682-220007 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

దేశవాళీ వరి సాగులో ఆదర్శం

- ప్రకృతి సిద్ధంగా పండిస్తున్న రైతులు

పాడి పంట

నడిగూడెం: మన దేశంలో పూర్వకాలంలో ఆరు లక్షల దేశీ వరి విత్తనాలు ఉండేవి. కాలక్రమేణా అవి అంతరిస్తూ ప్రస్తుతం ఆరు వేలు మాత్రమే ఉన్నాయి. పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ పితామహుడు డాక్టర్ సుభాష్ పాలేకర్ స్ఫూర్తితో దేశవాళీ వరి రకాలను సాగుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశీ వరి రకాలు సాగుచేస్తూనే విత్తన అభివృద్ధి కూడా చేస్తున్నారు.

ఆరేళ్లుగా సాగు

నడిగూడెం మండలంలోని చనుపల్లి గ్రామానికి చెందిన ఏలేటి వెంకటేశ్వరరెడ్డి 2014లో హైదరాబాద్‌లో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయరామ్ నిర్వహించిన ప్రత్యేక శిక్షణకు హాజరై అక్కడ ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు నేర్చుకున్నారు. నాటి నుంచి తనకున్న నాలుగెకరాల్లో ఎలాంటి రసాయన మందులను ఉపయోగించకుండా వ్యవసాయం చేస్తున్నారు. 2016 నుంచి విజయరామ్ వందల సంవత్సరాల కాలం నాటి దేశీ వరి రకాలను సాగు చేస్తున్నారు. భూమిలో సారం పెంచేందుకు జీవామృతం, ఘన జీవామృతం, పశువుల పెంటను ఉపయోగిస్తున్నారు. చీడపీడల నివారణకు వేప గింజల కషాయం, పుల్లటి మజ్జిగ, అగ్నిహాస్త్రం తదితర వాటిని ఉపయోగిస్తున్నారు. నాటి నుంచి మైసూరు మల్లిక, బర్మా బాస్మతి, చిట్టిముత్యాలు, సిద్ధసన్నాలు, నవారా సాగు చేస్తున్నారు. తాను పండించిన దేశీ రకాలను బియ్యం పట్టించి కోదాడలో ప్రముఖ వైద్యులకు, ఫోన్ చేసిన వారికి బియ్యాన్ని నేరుగా ఇంటికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఈ దేశవాళీ బియ్యం రకాన్ని బట్టి కిలో రూ.100 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. ఏలేటి వెంకటేశ్వర్‌రెడ్డి పట్టించిన బియ్యానికి బెంగళూరు, హైదరాబాద్‌లలో కూడా వినియోగదారులున్నారు.


నారాయణపురంలో సాగులో ఉన్న రత్నచోడి వరి రకం

విత్తనాల ద్వారా ఆదాయం

వెంకటేశ్వరరెడ్డి సాగుచేసిన దేశీ వరి విత్తనాలకు మంచి డిమాండ్ ఉందిది. జిల్లాలోని అనేక మంది రైతులకు ఆయన వద్ద ఉన్న సిద్ధసన్నాలు, నవారా, బర్మాబాస్మతి. మైసూరుమల్లిక రకాల విత్తనాలను కిలో విత్తనాన్ని రూ.100కు విక్రయిస్తూ లాభాలు పొందుతున్నారు.

హైదరాబాద్‌లో బియ్యం విక్రయం

మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి గత 12 సంవత్సరాలుగా తనకున్న మూడున్నర ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. దేశీ వరి రకాలైన చిట్టిముత్యాలు, నవారా, ఇంద్రాణి, లోకల్ బాస్మతి, బహురూపి, కర్పూరకేళి తదితర రకాలను సాగు చేస్తున్నారు. పండించిన పంటను బియ్యం పట్టించి హైదరాబాద్‌లో తన సోదరుడు సంతోష్‌రెడ్డి ద్వారా మార్కెటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని విక్రయిస్తున్నారు. ఒక ఎకరానికి ఖర్చులు పోను రూ.30వేల ఆదాయం ఒక సీజన్‌కు మిగులుతున్నదని వెంకటరెడ్డి చెబుతున్నారు. అలాగే చిరుధాన్యాలు కూడా సాగు చేస్తున్నారు. గత సీజన్‌లో ఒక ఎకరంలో ఎలాంటి మందులు ఉపయోగించకుండా నువ్వులు కూడా సాగు చేశారు.


నారాయణపురంలో వెంకటరెడ్డి సాగు చేసిన నువ్వుల పంట

కుటుంబ అవసరాలతో పాటు ఇతరులకు విక్రయం

మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి కోటిరెడ్డి ఒక ఎకరం భూమిలో దేశీ రకమైన నవార వరి రకాన్ని గత నాలుగు సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. అది కూడా ఎలాంటి రసాయన మందులు, పురుగు మందులను ఉపయోగించకుండా సాగు చేస్తున్నారు. పండిన పంటను బియ్యం పట్టించి ఆయన కుటుంబ సభ్యులు ఆహారం తీసుకుంటూ స్థానికంగా బియ్యం విక్రయిస్తున్నారు.

కాలాభట్టి రకం సాగు చేస్తున్నా



నాకున్న ఒక ఎకరం భూమిలో గత ఏడాదిగా కాలాభట్టి అనే దేశీ రకం వరి సాగు చేస్తున్నాను. ఈ పంటతో మా కుటుంబ అవసరాల తీర్చుకుంటూ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులకు విక్రయిస్తున్నాను. ఎలాంటి రసాయన మందులను ఉపయోగించకుండా సాగు చేస్తున్నాను. పంట దిగుబడి తక్కువ వచ్చినా ఆదాయం మాత్రం ఆశాజనకంగా ఉంది.

– ఎలగొండ నాగేశ్వరరావు, సిరిపురం

12ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం



గత 12 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా అంతరించిపోతున్న దేశీ రకాలను సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నాను. మా లాంటి రైతులకు ప్రభుత్వం రాయితీ కల్పించి ప్రోత్సహించాలి.

– నాగిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపురం


పండించిన పంటే ఆహారం



2016 నుంచి ఒక ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. జీవామృతం, ఘన జీవామృతం, వేప గింజల కషాయం, ఆవు మూత్రం పేడ, ఇంగువ ద్రావణాలను ఉపయోగిస్తూ చీడపీడలను నివారిస్తున్నాను. గత రెండేళ్లుగా దేశీ రకాలైన నవారా, సిద్ధ సన్నాలు సాగు చేస్తున్నాను. మేము పండించిన పంటనే ఆహారంగా తీసుకుంటూ మిగిలినది ఇతరులకు విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నాను.

– తిప్పిరెడ్డి కోటిరెడ్డి, రామాపురం

మార్కెటింగ్ నేనే ఏర్పాటు చేసుకున్నా



2014 నుంచి సిద్ధసన్నాలు, మైసూరు మల్లిక, నవారా వంటి దేశవాళీ వరి రకాలను సాగు చేస్తున్నాను. నేను పండించిన పంటను బియ్యం పట్టించి ఎవరికైనా కావాలంటే ఇంటికి తీసుకెళ్లి ఇస్తున్నాను. కోదాడ, ఖమ్మం ప్రాంతాలకు డోర్ డెలివరీ చేస్తున్నాను. బెంగళూరు, హైదరాబాద్ నగరాల వినియోగదారులకు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపిస్తున్నాను.

– ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, చనుపల్లి